మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఎం.ఎస్సీ.లో ఫస్ట్‌క్లాస్ తెచ్చుకుని, రీసెర్చ్ చేసి పిహెచ్.డి. అనిపించుకున్న హరీష్ భారతదేశంలోని నిరుద్యోగులకి ఎదురయ్యే సమస్యల ననుసరించి, మామూలు ప్రకారం పోలీస్ కానిస్టేబుల్‌గా చేరాడు.

మొదటి రాత్రి అతను బీట్‌కి తొలిసారిగా వెళ్ళాడు. తన విద్యకి సరిపడే ఉద్యోగం ఎప్పుడొస్తుందా అనే సమస్య అతనికి ఆ వుద్యోగానికి అప్లికేషన్ పెట్టుకున్నప్పటినించి పట్టి పీడిస్తోంది.

అర్థరాత్రి రెండు దాటుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఐశ్వర్యవంతుల కాలనీ అయిన బంజారాహిల్స్‌లోని ఓ పెద్ద రోడ్డుమీద నడుస్తున్న హరీష్‌కి ఎత్తయిన ఆ ప్రదేశం నించి క్రింద హైదరాబాద్ నగరం లైట్లు అక్కడక్కడ తిరిగే వాహనాల లైట్లు కనిపిస్తున్నాయి.

అలా నడుస్తుండగా అతనికి దూరంలో ఎవరో నక్కి కూర్చున్నట్లుగా అనిపించింది. గబగబ అటువైపు నడిచాడు. ఓ బండరాయిని ఆనుకుని నలభై పైబడ్డ, బలిష్టమయిన ఓ వ్యక్తి నేలమీద కూర్చుని వున్నాడు. ఆయన ఎడం చేతిలో ఓ బాటిల్ వుంది. దానిమీద లేబిల్‌ని బట్టి అది స్కాట్‌లేండ్‌లో తయారయిన విస్కీ బాటిల్ అని, అందులోనిది స్కాచ్‌విస్కీ అని గ్రహించాడు హరీష్.

"ఎవరు మీరు? ఇంత రాత్రి ఇక్కడేం చేస్తున్నారు?" అడిగాడు హరీష్.

ఆయన ఓ గుక్క మద్యం తాగి, తేలిపోయే కళ్ళని హరీష్ మీద కేంద్రీకరించలేక అతని పక్కనించి ఎటో చూస్తూ చెప్పాడు:

"ఎవరు నువ్వు! నా ఏకాంతాన్ని ఎందుకు పాడు చేస్తున్నావు?"

"నేను పోలీస్‌ని. మీ ఇల్లెక్కడ?"

"ఇక్కడికి చాలా దూరం. కొన్ని వందల మైళ్ళు".

ఆయన మాట ముద్దగా వస్తోంది. సరిగ్గా ఆలోచించలేని స్థితిలో వున్నాడనిపించింది హరీష్‌కి.

"చూస్తే పెద్దమనిషిలా వున్నారు. ఇంటికెళ్ళండి. మళ్ళా నేనిటొచ్చేసరికి మీరుండకూడదు" హెచ్చరించి హరీష్ ముందుకు సాగాడు.

వెనకనించి ఆయన ముద్ద కంఠం ఏదో పలికింది. ఉలిక్కిపడ్డాడు కాని వెనక్కి తిరగలేదు. అలాగే సాగిపోయాడు. అతనికి వినపడింది బూతు పదంలా అనిపించింది.

మళ్ళా తిరిగి ఆ ప్రదేశానికి రావడానికి హరీష్‌కి ముప్పావు గంట పట్టింది. ఆయన ఇంకా అక్కడ నించి కదల్లేదు. ఇప్పుడు బండరాతి మీద ఎక్కి కూర్చుని వున్నాడు. నిషా కొద్దిగా తగ్గినట్లుగా వుంది.



హరీష్‌ని తేరిపార చూసి అడిగాడాయన:

"ఇందాక ఎవరన్నావ్ నువ్వు?"

"కనపడటంలా-మీరెవరు?"

ఆయన బదులుగా చిద్విలాసంగా నవ్వాడు కాని సమాధానం చెప్పలేదు. అకస్మాత్తుగా ఆయన రెండు మాటలు మాట్లాడాడు. ఉలిక్కిపడ్డాడు హరీష్.

# ఇదీ సంగతి

"ఏమిటంటున్నావ్?" అడిగాడు కోపంగా.

ఆయన మరో రెండు మాటలన్నాడు. హరీష్ మొహం కోపంతో ఎర్రబడింది.

"నిన్ను అరెస్ట్ చేస్తున్నాను, బూతు మాటలు మాట్లాడినందుకు",

తూలుతున్న ఆయన్ని హరీష్ నెమ్మదిగా బండరాతి మీద నించి దింపి తనతో స్టేషన్‌కి తీసుకెళ్ళాడు. ఆయన ఏ కళనున్నాడో అభ్యంతరం చెప్పకుండా హరీష్ వెంట వెళ్ళాడు.

డ్యూటీలో వున్న ఎస్.ఐ.కి సంగతి వివరించాడు హరీష్. అలవాటు ప్రకారం కానిస్టేబుల్స్ ఆయన జేబులని వెదికారు. నాలుగైదు కాగితాలు దొరికాయి. ఎస్.ఐ. ఆ కాగితాల్లో రాసిన తెలుగు వ్యాక్యాలని చదివాడు. వెంటనే ఆయన మొహం జేవురించింది.

"బావున్నావా?" అడిగాడాయన మత్తుగా.

"రేపు కోర్టులో మెజిస్ట్రేట్‌ని అడుగు" పళ్ళు పటపట కొరికాడు ఎస్.ఐ.

మర్నాడు వుదయం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు ఆయన్ని. ఆయన జేబులో దొరికిన కాగితాలని మెజిస్ట్రేట్ చదివి, ముద్దాయి చేతివ్రాత నమూనాని పరిశీలించాడు.

అయన అప్పటికప్పుడు 'రాముడు బుద్ధిమంతుడు, సీత రాముడి భార్య. లక్ష్మణుడు సీత మరిది' అని వ్రాసిన చేతివ్రాత, ఆ కాగితాల్లోని చేతివ్రాత సరిపోయింది.

బూతు మాటలు రాసిన కాగితాలతో అర్థరాత్రి పబ్లిక్ ప్లేస్‌లో తిరుగుతున్నందుకు ఆతనకి అయిదు వందల రూపాయిల జరిమానాని విధించాడు మెజిస్ట్రేట్. తాగి రోడ్డుమీద కానిస్టేబుల్‌ని బూతులు తిట్టినందుకు కోర్టు లేచేదాకా జైలుశిక్ష కూడా విధించాడు. ఆయన్ని కోర్టులో ఓ మూల కూర్చోబెట్టారు.

అప్పటికి మత్తు బాగా దిగిపోవడంతో ఆయన జరిగినదానికి పశ్చాత్తాపపడసాగాడు.

* * *

"నిన్న రాత్రనగా బయటకి వెళ్ళినవారు ఇంతవరకు ఏం చేస్తున్నారు? ఎక్కడి కెళ్ళారు?" ఆయన కోర్టు నించి హైదరాబాద్‌లో, బంజారాహిల్స్‌లోని ఓ సినిమా నిర్మాత గెస్ట్‌హౌస్‌ని చేరుకున్నాక ఆయనొచ్చిన ఆటోకి డబ్బులిచ్చి పంపించి అడిగాడు నిర్మాత కంగారుగా.

"మన సినిమాకి పాటలు రాయడానికి ప్రశాంతంగా వుంటుందని రోడ్డుదాటి అలా బయటకు వెళ్ళాను."

"రాసారా?"

"ఆహ"

ఆయన జేబులోంచి నాలుగు కాగితాలు తీసి నిర్మాతకిచ్చాడు. ఆయన పక్కనే వున్న దర్శకుడు అందుకుని, ఆ నాలుగు పాటలని చదువుకుని చెప్పాడు మెచ్చుకుంటూ.

"బ్రహ్మాండంగా వున్నాయి.సిల్క్‌స్మిత డేన్స్‌పాట మరీ బావుంది. డ్యూయెట్లు చెప్పనే అక్కరలేదు. ఈ మధ్య కాలంలో మీరిలాంటి పాటలు రాయనేలేదు."

"అందుకేగా పాటల సిట్టింగ్‌కి ఇంతదూరం తీసుకొచ్చింది" నిర్మాత సంతోషపడ్డాడు.

* * *

ఓ రోజు వుదయం హరీష్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాలని యూనిఫాం వేసుకుంటుండగా వివిధభారతిలోంచి ప్రసారం అవుతున్న త్వరలో రాబోయే ఓ సినిమాలోని పాట పల్లవిని విని ఆశ్చర్యపోయాడు. ఆగి పాట పూర్తిగా విన్నాక మెజిస్ట్రేట్ కోర్టులో బూతు పదాలుగా నిర్ణయింపబడ్డ ఆ వ్యాఖ్యలు చేసినతను సినిమా పాటల రచయిత అని, ఆ రోజు కావాలనే తనెవరో రహస్యంగా వుంచాడని గ్రహించాడు.